వానకాల వధువులు!

- వరదల భయంతో పాక్‌లో బాల్య వివాహాలు!
- 2022 వరదల తర్వాత దయనీయ పరిస్థితులు
- ఆర్థిక భద్రత కరువవ్వడంతో కుటుంబాలు విలవిల
- డబ్బు తీసుకుని ఆడ పిల్లలకు పెండ్లి చేస్తున్న తల్లిదండ్రులు

ఇస్లామాబాద్ : పాకిస్థాన్‌లో 2022లో సంభవించిన వరదల ప్రభావం ప్రజలను ఇప్పటికీ వెంటాడుతున్నది. వాతావరణ మార్పుల వల్ల ఏర్పడిన ఆర్థిక అభద్రతా భావం ఆడ పిల్లల జీవితాలను సమస్యల సుడిగుండంలోకి నెడుతున్నది. జూలై-సెప్టెంబరు మధ్య కాలంలో కురిసే భారీ వర్షాలు, సంభవించే వరదలు, కొండచరియలు విరిగి పడటం, పంట నష్టాలు వంటివాటికి రైతులు భయపడిపోతున్నారు. తమ కుటుంబ ఆర్థిక భద్రత కోసం తమ మైనర్ కుమార్తెలకు పెండ్లి చేస్తున్నారు. తమ కుమార్తెల వయసు కన్నా రెట్టింపు వయసుగల పురుషుల నుంచి సుమారు రూ.2 లక్షలు తీసుకుని, వారితో వివాహాలు చేస్తున్నారు.

మూన్‌సూన్ బ్రైడ్స్..

2022లో సంభవించిన వరదల వల్ల పాకిస్థాన్‌లో మూడొంతుల భాగం జలమయమైంది. ఈ ప్రభావం నుంచి సింధ్ ప్రాంతం ఇంకా కోలుకోలేదు. దీంతో 'వానాకాలం వధువు'ల (మూన్‌సూన్ బ్రైడ్స్) ట్రెండ్ ప్రారంభమైందని బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఓ సంస్థ వ్యవస్థాపకుడు మషూక్ చెప్పారు. పురుషుల కుటుంబాల నుంచి డబ్బు తీసుకుని, తమ మైనర్ కుమార్తెలకు కొందరు తల్లిదండ్రులు పెండ్లి చేస్తున్నారన్నారు. గత వర్షాకాలం నుంచి తమ గ్రామంలో 45 మంది మైనర్ బాలికలకు వివాహాలు జరిగినట్లు ఖాన్ మహమ్మద్ మల్లాహ్ గ్రామ పెద్ద చెప్పారు.

తిరిగి పుట్టింటికి..

తమ పిల్లలను పేదరికం నుంచి కాపాడటం కోసమే వారికి వివాహం చేస్తున్నామని తల్లిదండ్రులు చెప్తున్నారు. మరోవైపు, బాల్యంలో వివాహం చేసుకున్న మైనర్ బాలికల్లో చాలా మందికి జీవనోపాధి కరువవుతున్నది. భర్తకు ఉపాధి లేకపోవడం, తమ ఆలనాపాలనా చూసుకోకపోవడంతో విసుగుచెంది భర్త, పిల్లలతో సహా తిరిగి తమ పుట్టింటికి వస్తున్నారు. దీంతో తల్లిదండ్రుల కష్టాలు రెట్టింపు అవుతున్నాయి.

జంక్ జీనియస్ 'అనుష్క'

- వ్యర్థాలతో అద్భుత హ్యూమనాయిడ్ రోబో సృష్టి
- కేఈఐటీ విద్యార్థులు, ప్రొఫెసర్ల వినూత్న ఆవిష్కరణ
- ప్రపంచంలో కొట్టుకునే గుండె ఉన్న తొలి రోబో ఇదే

న్యూఢిల్లీ, ఆగస్టు 16: ఉత్తరప్రదేశ్‌లోని కృష్ణా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (కేఈఐటీ) విద్యార్థులు అద్భుతాన్ని సృష్టించారు. డంపింగ్ యార్డు (చెత్తకుప్ప) నుంచి స్వీకరించిన పలు రకాల తుక్కు సామాన్లను ఉపయోగించి చాలా తక్కువ ఖర్చుతో ఏకంగా హ్యూమనాయిడ్ రోబో (మరమనిషి)ని రూపొందించారు. ఆ రోబోకు 'అనుష్క' అని నామకరణం చేశారు. వేద సూత్రాల ప్రేరణతో దీని ఇంటెలిజెన్స్ వ్యవస్థను, త్రీడీ ప్రింటెడ్ భాగాలతో ఫేసియల్ ఫీచర్స్‌ను తీర్చిదిద్దారు. భారత్‌లోని మేడమ్ టుస్సాడ్స్ బృందం రూపొందించిన ఫ్లెక్సిబుల్ సిలికాన్ స్కిన్‌ను తొడిగారు. ప్రపంచంలో కొట్టుకునే గుండెను కలిగి ఉన్న తొలి రోబో ఇదే కావడం విశేషం. కేవలం రూ.2 లక్షల ఖర్చుతో దీన్ని తయారు చేయడం గమనార్హం. ఇతర మాడళ్ల హ్యూమనాయిడ్ రోబోల తయారీ ఖర్చు కంటే ఇది చాలా తక్కువ. ఓపెన్ ఏఐ డాటాబేస్ నుంచి సంగ్రహించిన సమాచారాన్ని ఉపయోగించుకుని ప్రస్తుతానికి అనుష్క 61 భాషలు, 50 రకాల చేతి సంజ్ఞల (హ్యాండ్ గెశ్చర్స్) ద్వారా వినియోగదారులతో కమ్యూనికేట్ చేయగలుగుతున్నది.

జమ్ముకశ్మీర్ ఎన్నికల నగారా

- సెప్టెంబర్ 18 నుంచి మూడు దశల్లో ఎన్నికలు
- హర్యానా అసెంబ్లీకి అక్టోబరు 1న పోలింగ్
- అక్టోబరు 4న రెండు అసెంబ్లీల ఫలితాలు
- షెడ్యూల్ విడుదల చేసిన ఎన్నికల సంఘం
- పెండింగ్‌లో మహా, ఢిల్లీ, జార్ఖండ్ ఎన్నికలు

న్యూఢిల్లీ, ఆగస్టు 16: జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలకు నగారా మోగింది. దాదాపు దశాబ్దకాలం తర్వాత ఇక్కడ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. *2019*లో ఆర్టికల్ *370* తొలగించి, జమ్ము కశ్మీర్‌ను కేంద్రపాలిత ప్రాంతం చేసిన తర్వాత మొదటిసారి ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు శుక్రవారం కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు జ్ఞానేశ్ కుమార్, సుఖ్‌బీర్ సింగ్ సంధు.. జమ్ము కశ్మీర్‌తో పాటు హర్యానా అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించారు. జమ్ము కశ్మీర్ అసెంబ్లీకి చివరగా *2014* నవంబరు-డిసెంబరులో ఐదో దశల్లో ఎన్నికలు జరిగాయి. జమ్ము కశ్మీర్ అసెంబ్లీకి సెప్టెంబరు *30* లోపు ఎన్నికలు జరపాలని ఇటీవల సుప్రీంకోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే.

తర్వాతి దఫాలో మూడు రాష్ట్రాలకు.

*2019*లో హర్యానాతో పాటు మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు కూడా జరిగినా ఈసారి మాత్రం ఆ రాష్ట్ర ఎన్నికలకు ఈసీ షెడ్యూల్ ప్రకటించలేదు. జమ్ము కశ్మీర్ ఎన్నికల కోసం భద్రతా ఏర్పాట్లను దృష్టిలో పెట్టుకొని మహారాష్ట్ర ఎన్నికలకు ఇప్పుడు షెడ్యూల్ విడుదల చేయలేదని సీఈసీ రాజీవ్ కుమార్ తెలిపారు. జమ్ము కశ్మీర్, హర్యానా ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాత మహారాష్ట్ర, జార్ఖండ్, ఢిల్లీ ఎన్నికల షెడ్యూల్‌ను ఈసీ విడుదల చేయనుంది.

జమ్ముకశ్మీర్ (మొత్తం సీట్లు-90)

దశ	పోలింగ్ తేదీ	సీట్లు
మొదటి దశ	సెప్టెంబర్ 18	24
రెండో దశ	సెప్టెంబర్ 25	26
మూడో దశ	అక్టోబర్1	40
ఫలితాలు	అక్టోబర్ 4	

హర్యానా (మొత్తం సీట్లు-90)

పోలింగ్ తేదీ	అక్టోబర్ 1
ఫలితాలు	అక్టోబర్ 4

హర్యానాలో ఈసారి
టగ్ ఆఫ్ వార్

- మూడోసారి అధికారంపై కన్నేసిన కమలం పార్టీ
- హామీలు, ప్రజావ్యతిరేకతపై కాంగ్రెస్ ఆశలు
- లోక్‌సభ ఎన్నికల్లో రెండు పార్టీలకూ ఐదేసి సీట్లు
- అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇరు పార్టీల హోరాహోరీ!

చండీగఢ్, ఆగస్టు 16: హర్యానా ఎన్నికల నగారా మోగింది. *90* స్థానాలు ఉన్న ఈ అసెంబ్లీకి అక్టోబరు *1*న ఎన్నికలు జరగనున్నాయి. గత పదేండ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ హ్యాట్రిక్ సాధించి మరోసారి అధికారం చేపట్టాలని భావిస్తున్నది. ప్రభుత్వంపై వ్యతిరేకతను, హామీల వర్షాన్ని కురిపించి గద్దెనెక్కాలని కాంగ్రెస్ ఆశిస్తున్నది. ఆమ్ ఆద్మీ పార్టీ, జన్‌నాయక్ జనతా పార్టీ(జేజేపీ), ఐఎన్ఎల్‌డీ సైతం పట్టు సాధించే ప్రయత్నం చేస్తున్నాయి. అయితే, హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన పోటీ బీజేపీ, కాంగ్రెస్ మధ్య కనిపిస్తున్నది. లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని పది స్థానాల్లో ఈ రెండు పార్టీలు చెరో ఐదు స్థానాలను గెలుచుకోవడం బట్టి ఈ విషయం స్పష్టమవుతున్నది.

వ్యతిరేకతను తగ్గించే ప్రయత్నాల్లో బీజేపీ

*2014*లో హర్యానాలో సొంత బలంతో అధికారంలోకి వచ్చిన బీజేపీ *2019* నాటికి మ్యాజిక్ ఫిగర్ సాధించకపోవడంతో జేజేపీతో పొత్తు పెట్టుకొని అధికారం చేపట్టింది. ఈ పొత్తు ఇప్పుడు విచ్ఛిన్నమైంది. రైతుల ఆందోళన, అగ్నివీర్ పథకం, నిరుద్యోగం వంటి అంశాలతో పాటు పదేండ్ల పాలనపై సహజంగా ఉండే ప్రజావ్యతిరేకత బీజేపీకి మైనస్‌గా మారాయి. ప్రభుత్వంపై వ్యతిరేకతను తగ్గించేందుకు తొమ్మిదిన్నర రేండ్లు ముఖ్యమంత్రిగా ఉన్న మనోహర్ లాల్ ఖట్టర్‌ను తప్పించి నాయబ్ సింగ్ సైనీని ముఖ్యమంత్రిని చేసింది. అగ్నివీరులకు పలు ఉద్యోగ నియామకాల్లో ప్రాధాన్యం కల్పించింది. కొత్తగా *10* పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించి రైతుల ఆగ్రహాన్ని చల్లార్చే ప్రయత్నం చేసింది.

వరాలజల్లునే నమ్ముకున్న కాంగ్రెస్

ప్రజలను ఆకర్షించడమే పనిగా వరాలు ప్రకటించి కర్ణాటక, తెలంగాణ ఎన్నికల్లో సక్సెస్ అయిన ఫార్ములానే హర్యానాలోనూ కాంగ్రెస్ పార్టీ నమ్ముకున్నది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వృద్ధులకు నెలకు రూ.*6,000* పింఛను, *300* యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, రూ.*500*కే గ్యాస్ సిలిండర్లు ఇస్తామని హామీలు ఇచ్చింది. బీజేపీ ప్రభుత్వంపై వ్యతిరేకత కలిసొస్తుందని ఆశిస్తున్నది. ఇక, ఆమ్ ఆద్మీ కూడా ఉచిత విద్య, వైద్యం, విద్యుత్తు వంటి జనాకర్షక హామీలు భారీగానే ఇచ్చింది. ఆప్, జేజేపీ, ఐఎన్ఎల్‌డీ కాంగ్రెస్ ఓట్లకు గండి కొట్టే సూచనలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

పదేండ్లకు ఎన్నికలు..
ప్రజాతీర్పు ఎటో?

- ఎట్టకేలకు జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలకు మోక్షం
- తొలిసారి అధికారం చేపట్టేందుకు బీజేపీ యత్నాలు
- కమలం పార్టీ ఆశలన్నీ జమ్ము ప్రాంతం పైనే
- కశ్మీర్ లోయలో లోకల్ పార్టీల మధ్యే పోరు

శ్రీనగర్, ఆగస్టు 16: జమ్ము కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలకు ఎట్టకేలకు నగారా మోగింది. ఆరేండ్ల పాటు ముఖ్యమంత్రి లేకుండా కొనసాగిన ఈ కేంద్రపాలిత ప్రాంతంలో ఇక ప్రభుత్వం కొలువుదీరనుంది. *90* స్థానాల ఈ అసెంబ్లీలో పాగా వేసేందుకు జాతీయ, ప్రాంతీయ పార్టీలు ప్రయత్నాలు మొదలు పెట్టాయి. మొదటిసారి జమ్ము కశ్మీర్‌లో సొంతంగా అధికారం చేపట్టాలని బీజేపీ తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. మరోవైపు *2014*లో అధికారం కోల్పోయిన జమ్ము కశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్ ఈసారి మళ్లీ అధికారంలోకి రావాలని పట్టుదలగా ఉంది. గత ఎన్నికల్లో అతిపెద్ద పార్టీగా నిలిచి నాలుగేండ్లు అధికారంలో ఉన్న మెహబూబా ముఫ్తీ నేతృత్వంలోని జమ్ము కశ్మీర్ పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ(పీడీపీ) సైతం పట్టు నిలుపుకోవాలని ప్రయత్నిస్తున్నది.

జమ్ముపైనే బీజేపీ ఆశలు

జమ్ము ప్రాంతంపైనే బీజేపీ ఆశలు పెట్టుకుంది. ఇక్కడ *43* సీట్లు ఉన్నాయి. హిందువుల జనాభా ఎక్కువగా ఉండే జమ్ము ప్రాంతంలో నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీ ప్రభావం తగ్గింది. గత అసెంబ్లీ ఎన్నికలు, ఇటీవలి లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో ఇదే రుజువైంది. *2014* అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలిచిన *25* స్థానాలూ జమ్ము ప్రాంతంలోనివే. తాజా లోక్‌సభ ఎన్నికల్లో జమ్ములోని రెండు స్థానాలనూ బీజేపీ గెలుచుకుంది. నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా జమ్ములో ఆరు స్థానాలు పెరగడం బీజేపీకి కలిసొస్తుందనే అంచనాలు ఉన్నాయి. మొత్తం *50* స్థానాలపై బీజేపీ దృష్టి సారించింది. వీటిల్లోనే మేజిక్ ఫిగర్‌ను చేరుకునేన్ని సీట్లు గెలుస్తుందా అనేది చూడాల్సి ఉంది.

కశ్మీర్‌లో స్థానిక పార్టీలదే ఆధిపత్యం

కశ్మీర్ ప్రాంతంలో *47* నియోజకవర్గాలు ఉన్నాయి. ముస్లింల జనాభా ఎక్కువగా ఉండే కశ్మీర్‌లో బీజేపీ ప్రభావం నామమాత్రంగానే ఉంది. ఇక్కడ నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీ మధ్యనే ప్రధాన పోటీ ఉంది. లోక్‌సభ ఎన్నికల్లో కశ్మీర్ ప్రాంతంలోని మూడు స్థానాల్లో రెండింటిలో నేషనల్ కాన్ఫరెన్స్, ఒకదాంట్లో స్వతంత్ర అభ్యర్థి గెలిచారు. అయితే, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్ మధ్య పొత్తు ఉంది. ఇప్పుడు ఒంటరిగా వెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పుడు కూడా కశ్మీర్ ప్రాంతంపై నేషనల్ కాన్ఫరెన్స్ గంపెడాశలు పెట్టుకుంది.

గోడ ఎక్కి పార్లమెంట్‌లోకి యువకుడు

- అరెస్ట్ చేసిన ఢిల్లీ పోలీసులు
- బయటపడ్డ భద్రతా లోపం

న్యూఢిల్లీ, ఆగస్టు 16: పార్లమెంట్ భవనంలో భద్రతా లోపం మరోసారి బయటపడింది. 20 ఏండ్ల వయసున్న యువకుడొకరు గోడ ఎక్కి పార్లమెంట్ ప్రాంగణంలోకి ప్రవేశించాడు. శుక్రవారం మధ్యాహ్నం 2.45 గంటలకు ఆ యువకుడు గోడ ఎక్కి పార్లమెంట్ అనెక్స్ భవన ప్రాంగణంలోకి దూకాడు. పార్లమెంట్ భద్రతను పర్యవేక్షిస్తున్న సీఐఎస్ఎఫ్ సిబ్బంది అప్రమత్తమై స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అతడిని అరెస్ట్ చేసి ఢిల్లీలోని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నిందితుడి వద్ద అనుమానాస్పద వస్తువులేవీ లేవు. అతడిని యూపీలోని అలీగఢ్‌కు చెందిన మనీశ్‌గా గుర్తించారు. అతను మతిస్థిమితం లేనివాడిలా కన్పిస్తున్నాడని, అతని పేరును కూడా సరిగ్గా చెప్పలేకపోయాడని పోలీస్ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. కేంద్ర బలగాలు కూడా అతడిని ప్రశ్నిస్తున్నాయని ఆ అధికారి చెప్పారు.

పూజా ఖేద్కర్‌లానే మరో 22 మంది?

ఆర్టీఐ కార్యకర్త ఆరోపణ

ముంబై, ఆగస్టు 16, (నమస్తే తెలంగాణ): నకిలీ సర్టిఫికెట్లతో ఐఏఎస్ ఉద్యోగం పొందిన పూజా ఖేద్కర్‌లానే దేశంలో మరో 22 మంది అధికారులు ఉన్నారని మహారాష్ట్రకు చెందిన ఆర్టీఐ కార్యకర్త విజయ్ కుంభార్ ఆరోపించారు. వీరు కుల, జన్మ ధ్రువీకరణ, వైకల్యం వంటి వాటికి నకిలీ ధ్రువపత్రాలు సమర్పించి ఉద్యోగాలు తెచ్చుకున్నారని పేర్కొన్నారు. ఇలా నకిలీ ధ్రువపత్రాలతో ఉద్యోగాలు పొందిన వారు ఇప్పుడు ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్, ఐఎఫ్ఎస్‌గా పని చేస్తున్నారని చెప్పారు. ఈ అధికారులపై విచారణ జరిపించాలని ఆయన కోరారు.

లేఆఫ్ ప్రకటించారని.. సీఈవో పాస్‌పోర్ట్ చోరీ

బెంగళూరు: లేఆఫ్ ప్రకటించారన్న కోపంతో మాజీ ఉద్యోగి ఒకరు తన పాస్‌పోర్టు, అమెరికా వీసాను దొంగిలించినట్టు బెంగళూరుకు చెందిన స్టార్టప్ 'సార్థి ఏఐ' సీఈవో విశ్వనాథ్ ఝా ఆరోపించారు. సంస్థను కష్టాల నుంచి గట్టెక్కించేందుకు అమెరికా వెళ్లి నిధులు సేకరించాలని భావించానని, అయితే, మాజీ ఉద్యోగి ఒకరు తన పాస్‌పోర్ట్, వీసాను దొంగిలించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇన్వెస్టర్ల నుంచి ఒత్తిడి కారణంగానే ఉద్యోగులను తొలగించాల్సి వచ్చిందని చెప్పారు. సార్థి ఏఐ గతేడాది పెద్ద ఎత్తున ఉద్యోగులను తొలగించింది. వారిలో దాదాపు 50 మందికిపైగా ఉద్యోగులకు ఏడాదికిపైగా వేతనాలు చెల్లించలేదని, కోర్టు నోటీసులకు కూడా స్పందించడం లేదని ఉద్యోగి ఒకరు ఆరోపించారు.

రాహుల్ పౌరసత్వాన్ని రద్దు చేయండి

ఢిల్లీ హైకోర్టులో సుబ్రమణ్యస్వామి పిల్

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పౌరసత్వాన్ని రద్దుచేయాలంటూ బీజేపీ సీనియర్ నేత సుబ్రమణ్యస్వామి ఢిల్లీ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. రాహుల్‌గాంధీ తనకు తానుగా బ్రిటిష్ జాతీయుడినని ప్రకటించుకున్నారని, కాబట్టి ఆయన భారత పౌరసత్వాన్ని రద్దు చేసేలా కేంద్ర హోంశాఖను ఆదేశించాలని న్యాయస్థానాన్ని అభ్యర్థించినట్టు ఎక్స్‌లో తెలిపారు. రాహుల్‌పై చర్యలు తీసుకోవద్దని ప్రధాని మోదీని సోనియాగాంధీ బ్లాక్‌మెయిల్ చేస్తున్నారా? అని ప్రశ్నించారు. యూకేలో గతేడాది రిజిస్టర్ అయిన కంపెనీ డైరెక్టర్లలో రాహుల్ ఒకరని పేర్కొన్నారు. 2005లో ఆ కంపెనీ ఫైల్ చేసిన వార్షిక రిటర్నులో రాహుల్‌గాంధీని బ్రిటిష్ పౌరుడిగా పేర్కొన్నారని చెప్పారు.

నగరాల్లో 50 కూరగాయల క్లస్టర్లు

రైతుల నుంచి నేరుగా వినియోగదారులకు సరఫరా

ఆమోదానికి త్వరలో కేంద్ర క్యాబినెట్ ముందుకు

న్యూఢిల్లీ, ఆగస్టు 16: దేశంలోని పలు నగరాల్లో దాదాపు 50 కూరగాయల క్లస్టర్లను ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతున్నదని అధికారిక వర్గాలు వెల్లడించాయి. వ్యవసాయ శాఖ రూపొందిస్తున్న ఈ పథకం త్వరలో కేంద్ర క్యాబినెట్ ముందుకు రానున్నట్టు సమాచారం. 20 లక్షలకు పైగా జనాభా ఉన్న నగరాల సమీప ప్రాంతాల్లో ఈ వెజిటెబుల్ హబ్‌లను ఏర్పాటు చేస్తారు. ఈ స్కీమ్ ద్వారా మధ్యవర్తుల వ్యవస్థ ఉండదని, కస్టర్లకు నేరుగా కూరగాయల సరఫరా ద్వారా రైతులు సాధికారిత సాధ్యమవుతుందని వ్యవసాయ శాఖ వర్గాలు తెలిపాయి. కూరగాయల ఉత్పత్తి పెరుగుతుందని, సప్లై చైన్‌లు మెరుగవుతాయని పేర్కొన్నాయి. రైతులు, వినియోగదారులకు ధరలను స్థిరీకరించడంతో పాటు ఉత్పత్తిని పెంచడం ఈ స్కీమ్ ప్రధాన లక్ష్యమని వెల్లడించాయి. ఈ కొత్త విధానం ద్వారా పెద్ద నగరాల సమీపంలో ఉండే 2 లక్షలకు పైగా రైతులు లబ్ధి పొందుతారని పేర్కొన్నాయి. రైతుల నుంచి వినియోగదారులకు డైరెక్ట్ సప్లై చైన్‌ను ఏర్పాటు చేయడం ద్వారా మధ్యవర్తుల పాత్రను తగ్గించొచ్చని ఓ అధికారి అన్నారు.

ఎస్ఎస్ఎల్వీ-డీ3
ప్రయోగం సక్సెస్

- కక్ష్యలోకి చేరిన ఈవోఎస్-08 ఉపగ్రహం
- విపత్తు నిర్వహణలో ఈ శాటిలైట్ వినియోగం
- తేలికపాటి వాహకనౌక శ్రేణిలో ఇస్రో ముందడుగు
- వాణిజ్య ప్రయోగాలకు న్యూస్పేస్ ఇండియా సిద్ధం

ఇస్రో శాస్త్రవేత్తలకు కేటీఆర్ శుభాకాంక్షలు

ఎస్ఎస్ఎల్వీ-డీ3 ప్రయోగం విజయవంతంగా జరిపిన ఇస్రో బృందానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు.

హైదరాబాద్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ): భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) చేపట్టిన స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికిల్(ఎస్ఎస్ఎల్వీ) మూడో, చివరి డెవెలప్‌మెంటల్ ఫ్లైట్(డీ3) ప్రయోగం విజయవంతమైంది. శుక్రవారం ఉదయం 9.17 గంటలకు శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి ఈ ప్రయోగం జరిగింది. ఈ వాహక నౌక నింగికి దూసుకెళ్లిన కొన్ని నిమిషాల్లోనే భూపరిశీలన ఉపగ్రహాన్ని(ఈవోఎస్-08) వేరు చేసి నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. ఇస్రోకు చెందిన యూఆర్‌రావు శాటిలైట్ సెంటర్‌లో ఈవోఎస్‌ను అభివృద్ధి చేశారు. నిఘా, విపత్తులు, మంటలను గుర్తించడం, అగ్ని పర్వతాలను పర్యవేక్షించడం, పర్యావరణ పర్యవేక్షణకు దీనిని వినియోగిస్తారు. స్పేస్ కిడ్జ్ ఇండియా అభివృద్ధి చేసిన ఎస్ఆర్-ఓ డెమొశాట్ అనే మరో చిన్న ఉపగ్రహాన్ని సైతం కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. ఈ రెండు ఉపగ్రహాలు కలిపి దాదాపు 175.5 కిలోల బరువు ఉన్నాయి.

500 కిలోలు.. 500 కిలోమీటర్లు

ఇస్రో తేలికపాటి వాహకనౌక శ్రేణిలో మొదటి ప్రయోగాన్ని(డీ1) 2022 ఆగస్టులో జరపగా ఆశించిన విజయం దక్కలేదు. దీంతో 2023 ఫిబ్రవరిలో డీ2ను ప్రయోగించగా ఇది విజయవంతమైంది. చివరగా డీ3ని శుక్రవారం విజయవంతంగా ప్రయోగించింది. ఇది ఇస్రో వాణిజ్య విభాగమైన న్యూస్పేస్ ఇండియాకు బలాన్ని ఇచ్చింది. ఇక న్యూస్పేస్ ఇండియా వివిధ దేశాలు, ప్రైవేటు సంస్థలకు చెందిన 500 కేజీల వరకు బరువున్న ఉపగ్రహాలను తేలికపాటి వాహక నౌక(ఎల్వీ) ద్వారా ప్రయోగించగలదు.

నేడు వైద్య సేవలు బంద్

- కోల్‌కతా హత్యాచార ఘటనను నిరసిస్తూ 24 గంటల ఆందోళనకు ఐఎంఏ పిలుపు
- అత్యవసరం కాని సేవలు నిలిపివేత
- అర్ధరాత్రి దవాఖానపై దుండగుల దాడి ప్రభుత్వ యంత్రాంగ వైఫల్యమే
- మమతాబెనర్జీ సర్కారుపై హైకోర్టు ఆగ్రహం

వైద్య సిబ్బందిపై దాడి జరిగిన 6 గంటల్లో ఎఫ్ఐఆర్

వైద్య సంస్థలకు కేంద్రం ఆదేశం

న్యూఢిల్లీ: కోల్‌కతా ట్రైనీ డాక్టర్ హత్యాచార ఘటనతో వైద్యసంస్థలకు కేంద్ర ఆరోగ్యశాఖ కీలక ఆదేశాలు జారీ చేసింది. విధుల్లో ఉన్న వైద్యసిబ్బందిపై దాడి జరిగిన ఆరు గంటల్లోగా ఇన్‌స్టిట్యూషనల్ ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని స్పష్టం చేస్తూ దేశంలోని అన్ని కేంద్ర ప్రభుత్వ దవాఖానలు, ఎయిమ్స్ డైరెక్టర్లకు, అన్ని మెడికల్ కాలేజీల ప్రిన్సిపాల్స్‌కు డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ డాక్టర్ అతుల్ గోయెల్ ఆదేశాలిచ్చారు. 'విధుల్లో ఉండగా ఏ ఆరోగ్య కార్యకర్తపైనైనా దాడి జరిగితే.. 6 గంటల్లోగా ఇన్‌స్టిట్యూషనల్ ఎఫ్ఐఆర్ నమోదు చేసే బాధ్యత వైద్య సంస్థ అధిపతిదే' అని పేర్కొన్నారు.

కోల్‌కతా/న్యూఢిల్లీ, ఆగస్టు 16: కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ దవాఖానలో ట్రైనీ డాక్టర్ హత్యాచార ఘటనను నిరసిస్తూ శనివారం ఉదయం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు 24 గంటల పాటు దేశవ్యాప్తంగా అత్యవసరం కాని వైద్య సేవలను నిలిపివేయనున్నట్టు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ప్రకటించింది. ఈ సందర్భంగా ఐఎంఏ కేంద్ర ప్రభుత్వం ముందు ఐదు డిమాండ్లు ఉంచింది. ఎయిర్ పోర్టుల మాదిరిగా దేశవ్యాప్తంగా ఉన్న దవాఖానలను కూడా 'సేఫ్ జోన్లు'గా ప్రకటించాలని ఐఎంఏ చీఫ్ డాక్టర్ ఆర్‌వీ ఆశోకన్ డిమాండ్ చేశారు. వైద్యులు, సిబ్బందిపై దాడుల కట్టడికి కఠిన చట్టం తీసుకురావాలన్నారు. బాధితురాలి కుటుంబానికి గౌరవప్రదమైన పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వైద్యుల పని గంటలు, పని పరిస్థితులపై ఐఎంఏ మరో డిమాండ్ చేసింది. హత్యాచారానికి గురైన బాధితురాలు వరుసగా 36 గంటల పాటు డ్యూటీలో ఉన్నారని, ఇది సరైనదేనా? అని ప్రశ్నించారు.

ప్రభుత్వ యంత్రాంగ వైఫల్యమే

కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ దవాఖానపై దుండగులు సృష్టించిన విధ్వంసం కచ్చితంగా రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగ వైఫల్యమేనని కలకత్తా హైకోర్టు శుక్రవారం పేర్కొన్నది. దవాఖానలో పరిస్థితిపై ఈనెల 21లోగా వేర్వేరుగా అఫిడవిట్లు సమర్పించాలని పోలీసులు, హాస్పిటల్ యాజమాన్యాన్ని చీఫ్ జస్టిస్ టీఎస్ శివజ్ఞానం నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశించింది. దవాఖాన వద్ద దాదాపు 7 వేల మంది గుమిగూడుతారన్న నిఘా వర్గాల సమాచారం పోలీసుల వద్ద లేదనడం నమ్మడం కష్టమని ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది. 'ఇది పూర్తిగా రాష్ట్ర యంత్రాంగం వైఫల్యమే. తమ సొంత వ్యక్తులను కూడా పోలీసు బలగాలు రక్షించుకోలేకపోవడం విచారకరం' అని పేర్కొన్నది. హాస్పిటల్‌లో పనిచేస్తున్న వైద్యులకు తగిన రక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నది. మూకను అదుపు చేయలేక పోలీసులు గాయపడ్డారంటే, శాంతి భద్రతలు విఫలమైనట్టేనని కోర్టు వ్యాఖ్యానించింది. తదుపరి విచారణను కోర్టు ఈనెల 21కు వాయిదా వేసింది.

బీజేపీ, సీపీఎంలే చేశాయి: మమత

ఆర్‌జీ కార్ దవాఖానలో బీజేపీ, సీపీఎం పార్టీలే విధ్వంసానికి పాల్పడ్డాయని పశ్చిమ బెంగాల్ సీఎం, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. ఆధారాలను నాశనం చేసేందుకు ఆ పార్టీలు ఇలా చేశాయని అన్నారు. కోల్‌కతాలో శుక్రవారం నిర్వహించిన నిరసన ర్యాలీలో మాట్లాడుతూ ట్రైనీ డాక్టర్ హత్యాచార ఘటనపై వాస్తవాలు బయటకు రావాలని, అయితే కొంత మంది సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్ వ్యాప్తి చేయిస్తున్నారని అన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని ఆమె డిమాండ్ చేశారు. హత్యాచార ఘటనపై బీజేపీ రాష్ట